# పసివాడి నిర్ణయం

-సి హెచ్. వి. బృందావనరావు

"ఇప్పుడు టైమెంతైందో తెలుసా? ఇప్పుడా ఇంటికి రావడం?"

"ఏం, మీరు రోజూ టైం ప్రకారమే వస్తున్నారా? ఏవో మీటింగులనీ, అవనీ మీ ఇష్టం వచ్చినప్పుడు మీరు రావడంలేదా."

"నేనంటే మగవాణ్ణి. నాకు వంద పనులుంటాయి. నాతో నీకు పోటీయా?"

"ఎందుకుండగూడదూ. నేను ఇంటిపట్టునే చావాలా? నాకంటూ ఓ సోషల్ లైఫ్ అక్కరలేదా?"

"సోషల్ లైఫ్ సోషల్ లైఫ్ అంటూ రోజంతా బలాదూర్లు తిరగడమేనా?"

"నేనేం బలాదూర్లు తిరగడంలేదు. మీరు మీ ఇష్టం వచ్చినట్లు తిరుగుతుంటే నేనేమైనా అంటున్నానా?"

"చూడు సుజాతా, ఇల్లన్న తర్వాత భార్యాభర్తలిద్దరూ ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు నడిస్తే కాపురం ఎట్లా సాగుతుంది?"

"నేను చెప్పేదీ అదే. నువ్వు నీ తిరుగుళ్లు తగ్గించుకో"

"నా కెట్లా వీలవుతుంది?"

"ఎందుగ్గాదు?"

"నేను మా ఆఫీసు యూనియన్ సెక్రటరీని. ఎక్కడెక్కడికో పోవాలి. ఎందర్నో కలవాలి."

"అలా అని రోజంతా ఇంటిపట్టున వుండకపోతే నా సంగతేంది? నేను కొంచెం సేపయినా బయటికి వెళ్లకుండా నీ కోసం ఎదురు చూస్తూ ఇంట్లో మగ్గిపోవల్సిందేనా?"

"కొద్దిగా అడ్జస్ట్ కావచ్చుగా..."

"ఏం, ఆ అడ్జస్టు నువ్వే ఎందుకు కాకూడదు?"

"మళ్లా మొదటికే వస్తే నేనేం చెప్పేది? కనీసం పిల్లవాడి సంగతైనా పట్టించుకోవా?"

"వాడు నీకు మాత్రం కొడుకు కాదా? కొంచెం సేపయినా వాడితో గడుపుతున్నావా నువ్వు?"

"నాకు మాత్రం వాడి మీద ప్రేమ లేదా? వాడు లేకుండా నేను బ్రతగ్గలనా? కానీ ఏం చేయను?"

"మీరేమైనా చేయండి. ఇరవై నాలుగ్గంటలూ ఇంటికి అతుక్కొని కూచోడం నా వల్ల కాదు."

"అంతేనా?"

"అస్తమానమూ నీ కోసం ఎదురు చూస్తూ కూచుంటే నాకు తోచదు. మా క్లబ్ మహిళా సంఘానికి నేను సెక్రటరీగా నిల్చోబోతున్నాను. మా ఫ్రెండ్సందరూ బలవంతం చేస్తున్నారు."

"ఇప్పుడు నీకా మహిళా మండలి సెక్రటరీ ఎన్నిక అవసరమా?"

"మీ ఆఫీసు యూనియన్ సెక్రటరీ పదవి నీకు అవసరమా?"

"అయితే ఇంక అసలు ఇంట్లో ఉండనే ఉండవన్న మాట"

"ముందు నీ సంగతి నువ్వు ఆలోచించుకుని, ఆ తర్వాత నాకు నీతుల్చెప్పు. నీలాగే నేనూ అని

## వ్యసనం-దుర్వ్యసనం

స్వతహాగా మానవుడు / వ్యసనపరుడు
మనిషికి వ్యసనం ప్రారంభంలో ప్రమోదం!
అది దుర్వ్యవసనంగా మారితే ప్రమాదం!!
ధూమపానం మధుసేవనం
స్త్రీలోలత్వం, చతుర్ముఖ పారాయణం
మరెన్నో దుర్వ్యసనాలు
అవుతాయి తప్పించుకోలేని అవసరాలు
కడు దుర్లభం మంచి అలవడడం!
బహు సులభం చెడు అబ్బడం!
శీలం మనిషికి కిరీటం
అది లేనినాడు పశువుతో సమానం
జూదం వలన కోల్పోయెను
ధర్మరాజు సర్వస్వం
దుర్వ్యసనం వల్లనే కదా అడవిపాలాయెను
నలమహారాజు జీవనం
ఏ వ్యసనమైనా మొదట్లో పొరపాటు
తరువాత గ్రహపాటు / పిదప అలవాటు
జీవితం నైతిక పతనం / శరీరం రోగగ్రస్తం
ఇలా ఎన్నో కుటుంబాలు వీధిపాలు
వేలాది మంది కాటి పాలు/ అందుకే వీటి జోలికి
పోవద్దన్నా! / వెళ్లావో సంఘంలో
నీకు గౌరవం సున్నా.

-కళాప్రియ

ఎందుకనుకోవు?"

"ఇద్దరూ అలా అనుకుంటే ఇక కాపురం సంగతేమిటి?"

"అదేగదా, నేనూ మొత్తుకునేది. ఎంతసేపూ నన్నే అడ్జస్టు కమ్మంటే ఎల్లా? నువ్వూ అడ్జస్టు కావచ్చుగదా?"

"నాకు వీలు కాదంటే వినవేం నువ్వు"

ఈ వాదనలన్నీ వింటూ తలుపు దగ్గరే నిల్చుని వున్నాడు పదేళ్ల కార్తీక్. వాడు అప్పుడే స్కూలు నుంచి వచ్చాడు. వాడికి ఇలాంటి దృశ్యాలు కొత్తకాదు. ఇంట్లో తల్లిదండ్రులిద్దరూ ఇలా గొడవ పడుతూనే వుంటారు, కలుసున్న కొద్దిసేపూ ప్రతిరోజూ. ఒకటి, రెండ్రోజులు కాదు, రోజూ ఇదే గొడవ. ప్రాణం కడగట్టిపోతున్నది కార్తీక్‌కు. తన తోటి పిల్లలను వాళ్ల తల్లిదండ్రులు రోజూ బయటకు తీసుకెళతారు. తల్లో తండ్రో ఎవరో ఒకరు, అప్పుడప్పుడూ ఇద్దరూ వారిని పార్కులకో, సినిమాలకో, షికార్లకో తీసుకెళుతూనే వుంటారు. తన ఇంట్లో ప్రతిరోజూ పోట్లాటే. ఈరోజు కేవలం కొద్దిపాటి వాదనలతోనే తేలిపోయింది. గొంతు పెంచి పెద్దగా గొడవ పడటం చాలా మామూలు. తండ్రి ఒకటి రెండు సార్లు తల్లి మీద చేయి చేసుకోవడం కూడా జరిగింది.

సుజాత కార్తీక్‌ను చూసింది. "వచ్చావా కన్నా" అంటూ దగ్గరికి తీసుకోబోయింది.

"ఎంతసేపయింది నాన్నా వచ్చి" అని రాజశేఖర్ కొడుకునడిగాడు.

కార్తీక్ ఏమీ సమాధానం చెప్పకుండా లోపలికి వెళ్లిపోయాడు.

రాజశేఖర్, సుజాతలకు ఒకడే కొడుకు. వాడంటే ఇద్దరికీ ప్రాణం. వాడి మీద వుండే అభిమానమూ, ప్రేమా వారిద్దరి గొడవలను ఏమాత్రం తగ్గించలేక పోయాయి. ప్రేమ ప్రేమే. గొడవలు గొడవలే. వారిద్దరూ బాగా చదువుకున్నవారే. రాజశేఖర్ టెలికాం జి.యం. ఆఫీసులో యూడీసీ. యూనియన్ సెక్రటరీ కూడా. సుజాత యం.ఏ. చదివింది. వారి పెళ్లయి పన్నెండేళ్లయింది. మొదట ఒక సంవత్సరం గొడవల్లేకుండా ఉన్నారేమో! కార్తీక్ పుట్టాక మరో రెండేళ్లు వాడితో గడపడంలో అంతగా గొడవలు అన్పించలేదు. తర్వాత బ్రతుకు యాంత్రికమైపోయింది. కార్తీక్ ఉదయమే స్కూలుకెళ్లి సాయంత్రం ఏ ఆరింటికో వస్తుంటే, ఈ మధ్య కాలంలో ఒంటిగా ఇంట్లో ఉండలేక క్లబ్బులనీ, స్నేహితులనీ, మహిళా మండళ్లనీ అలవాటు చేసుకుంది సుజాత. మొదట భరించినా తర్వాతర్వాత రాజశేఖర్ తగవు పడటం మొదలుపెట్టాడు. మాటంటే పడేరకం కాదు సుజాత. మాటకు మాట తెగులు, నీటికి నాచు తెగులు అన్నట్టు మాటకు మాట జవాబు చెపుతూ రోజూ గొడవలు పడటం మామూలైపోయింది.

వారి తగాదాల మధ్య కార్తీక్ నలిగిపోతున్నాడని వారు అర్థం చేసుకోవడం లేదు. ఎవరికి వారు తాము కార్తీక్‌ను ప్రేమగా చూస్తున్నాంగదా అని అనుకుంటున్నారు. వాడికి ఎప్పుడేమి కావాల్సినా తీసిస్తున్నాంగదా అనుకుంటున్నారు. రాజశేఖరూ, సుజాత ఇద్దరికిద్దరూ పట్టుదల గల మనుషులవడం చేత జీవితంలో వారు స్వయంగా ఏమి పొగట్టుకుంటున్నారో, కార్తీక్‌క బాల్య జీవితంలోని ప్రశాంతతనీ, మధురిమనూ, ఆత్మీయ

## కాలపాశి

కాలం ఒక మహా స్వప్నం
కాలం ఒక మహా సర్పం
ఎప్పుడు ఎక్కడ ఎందుకు ఎలా కలుపుతుందో
అర్థంకాదు
ఆలోచించేకొద్దీ ఆత్మీయత అనురాగం నిలుస్తాయి
ఈ అనుబంధ కాలచక్రంలో
గమ్మత్తులు, విచిత్రాలు జరుగుతూనే ఉంటాయి
కదిలించిన వారు మదిలో నిలిచి ఉంటారు
కలుక్కుమనిపించినవారు చేదైపోతారు
ఉదయం నుండి మరో ఉషోదయం దాకా
కాలపత్రంపై జీవిత దృశ్య కావ్యాలు
నగ్నసత్యాలు లిఖించి కనబడుతుంటాయి
ఒక ఆలోచన, సంఘటన, గాయం, కవిత స్పందన
ఒకదానితో మరోటి ముడిపడేస్తూ ఉంటాయి
మనిషిని నిమిషాల్లో నిచ్చెనపైకి ఎక్కిస్తుంది
పగబట్టితే అథోపాతాళానికి తొక్కేస్తుంది
పైకి ఎక్కుతున్నప్పుడు మనకు ఆనందం కల్గును
కాలపాశి మనల్ని దించుతున్నప్పుడు దానికి
ఆహ్లాదం
మనం చేరాల్సింది వైకుంఠ కాలపాళిని
ఎలా వేధించినా, కరుణించినా
నిబ్బరంగా, నిదానంగా కాలాన్ని తలుచుకుంటూ
పైకి వెళ్ళటానికే ప్రణాళికను వేసుకుందాం.

-రాంబ్రతి

తనూ ఎలా లేకుండా చేస్తున్నారో అర్థం చేసుకోవడం లేదు. కలిసి కూర్చొని, ప్రశాంతంగా చర్చించుకుని సర్దుబాటు ధోరణిలో కాపురం సుఖమయం చేసుకుందామనే ఆలోచనే లేదు ఇద్దరికీ.

మరలా ఆరోజు ఆఫీసు నుంచి వచ్చేసరికి బాగా ఆలస్యమైంది రాజశేఖర్‌కు. ఇంకొచ్చేసరికి సుజాత లేదు. కార్తీక్ ఒక్కడే ఇంట్లో కూర్చుని తల్లిదండ్రుల కోసం ఎదురు చూస్తున్నాడు. కార్తీక్‌కు జ్వరంగా వుంది. చలికి వణికిపోతున్నాడు. సోఫాలో ముడుక్కుని పడుకున్నాడు. వాడిని ఆ స్థితిలో చూసేసరికి రాజశేఖర్‌కు దుఃఖం పొంగుకొచ్చింది. దుఃఖంతో పాటు సుజాత మీద కోసం కూడా అదే నిష్పత్తిలో పెరిగి పోయింది. ఇంతలో సుజాత కూడా ఇంటికి చేరింది. కార్తీక్‌ను ఆ స్థితిలో చూసి సుజాతకు కూడా దుఃఖం పెల్లుబికింది. ఏవో టాబ్లెట్లు వేసి పడుకోబెట్టారు.

తర్వాత మళ్లీ తగాదా మొదలు.

"ఒకసారి చెబితే బుద్ధుండక్కర్లేదా? అసలు నువ్వాడదానివేనా? ఇంటి దగ్గర వుండకుండా దేశమంతా పెత్తనాలు చేసి వస్తే ఇదుగో ఇలాగే ఏడుస్తాయి కాపురాలు."

"నోటికి సుద్దీ బుద్ధీ లేకుండా మాట్లాడితే నేనూరుకోను. ఆడదే ఇల్లు పట్టుకుని పడుండాలా? నువ్వెందుకు పెందరాళే రాలేదు? నీకో రూలూ, నాకో రూలూనా?"

## ఒకరాత్రి

ఆకాశం చూస్తున్నది
చుక్కల కళ్లు తెరుచుకొని.
నిశ్శబ్దాన్ని మింగి
గురకపెడుతున్నది గాలి.
గడియారానికి వేలాడేది
కాలమే కాదు
దూరం కూడా!
మొగ్గలు విచ్చుకుంటున్నాయి
పరిమళాలు గుచ్చుకుంటున్నాయి.
రెప్పల మాటున
మెలుకువ చిట్లిన చప్పుడు.
ఏదో ఊహించని పిలుపు
బహుశా నా కవిత్వంలో మలుపు.

-ఎన్. అరుణ

"ఉద్యోగం చేసే వాడిని నాకెన్నో పనులుంటాయి. నీకేం రోగం ఇంట్లో ఉండకుండా..."

"రోగం గీగం అంటే మాట దక్కదు జాగ్రత్త. అయిదు గంటలకు ఆఫీసైపోతే తొమ్మిది దాకా ఏమి రాచకార్యాలు వెలగబెడుతున్నావు? ఇంటికి రావచ్చుగా"

"చూస్తుంటే మరీ రెచ్చిపోతున్నావు. పెళ్లాన్ని పెత్తనాలకు పంపి ఇంటి దగ్గర పడుండే ఆడంగి వెధవను కాన్నేను"

"మొగుడేమన్నా అణగి మణిగి పడుండే పాత కాలపు ఆడదాన్ని కాన్నేను. ఒకటంటే పది అనగలను."

"ఎందుకనలేవూ, నువ్వసలు మనిషివైతే కదా. బుద్ధీ జ్ఞానం వుంటేగదా!"

"నీకున్నాయా బుద్ధీ జ్ఞానం?"

సుజాత చెంప ఛెళ్ మంది. చెంప నిమురుకుంటూ "సరే, ఇక ఈ రకంగా మనం కాపురం చేయలేము. ఎవరి దారి వారు చూసుకోవడం మంచిది" అంది.

"ఏం, బెదిరిస్తున్నావా? ఫో, నీ దిక్కున్నచోటకి ఫో. నువ్వు లేకుంటే నేను బ్రతకలేననుకున్నావా?"

"నేనేనా బ్రతకలేనిది? నాకూ చదువుంది. ఉద్యోగం సంపాదించుకోగలను. నా కాళ్లమీద నేన్నిలబడగలను."

"ఇంకేం, పో, వెళ్లిపో"

"పోకేం! తెల్లవారగానే ముందు చేసే పనే అది. మా గుడ్డలూ, సామాన్లూ సర్దుకుని కార్తీకూ, నేనూ వేరే ఇల్లు తీసుకుని వెళ్లిపోతాం. విడాకుల నోటీసు అందుకోడానికి సిద్ధంగా వుండు."

"కార్తీక్ ఎక్కడికి? కార్తీక్ నా దగ్గరే వుంటాడు"

"అదేం కుదరదు. నేను వాడి తల్లిని"

"నేను వాడి తండ్రిని"

"నేను తొమ్మిది నెలలు మోసి కన్నాను"

"నేను అన్ని సౌకర్యాలూ కల్పించి సాకాను"

"నేను వాడికి జోల పాడాను, లాల పోశాను, గోరు ముద్దలు తిన్పించాను, మలమూత్రాలు ఎత్తిపోశాను"

"నేను వాడికి గుడ్డలు కొన్నాను. పుస్తకాలు కొన్నాను. బళ్లో వేశాను. జబ్బు చేస్తే డాక్టరు చుట్టూ తిరిగాను. నా భుజం మీద వేసుకుని లాలించాను."

కార్తీక్ అంత జ్వరంలోనూ వారిద్దరి పోట్లాట మౌనంగా చూస్తూ, వింటూ వున్నాడు.

"ఎట్టి పరిస్థితుల్లోనూ కార్తీక్‌ను వదలిపోయే ప్రసక్తే లేదు" అంది సుజాత.